క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఉప రవాణా కమిషనర్

ఒంగోలు అర్బన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఉప రవాణా కమిషనర్ సుశీల బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలతను కలిశారు.

డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డిపై దాడి

ఒంగోలు: స్థానిక దక్షిణ బైపాస్‌లోని పీఎల్ఆర్ కల్యాణ మండపంలో వివాహ వేడుకకు హాజరై తిరుగు ప్రయాణమవుతున్న సమయంలో సింగరాయకొండ శివరామిరెడ్డి హాస్పిటల్ వైద్యుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డిపై దాడి జరిగింది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పీఎల్ఆర్ కల్యాణ మండపంలో సుభాని కుమారుడి రిసెప్షన్‌కు హాజరై తిరిగి వెళ్తుండగా కల్యాణ మండపం బయట కొంత మంది రాయితో దాడిచేసి గాయపరిచారు. దీనిపై తాలూకా పోలీసులకు ఆయన ఫిర్యాదు చేయగా, ఐపీసీ 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగనన్నను ఆశీర్వదించండి

- గడపగడపలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి
- జగనన్న కాలనీల్లో ఆర్చిల నిర్మాణాలకు శంకుస్థాపన



సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా చల్లని దీవెనలు అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. చీమకుర్తి మున్సిపాలిటీలోని 19వ వార్డులో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గడపగడపలో సంక్షేమ పథకాల లబ్ధిదారులతో వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి సరాసరిన రూ.8 లక్షల నుంచి రూ.13 లక్షల విలువైన సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు నిరంతరం పేదలకు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే సాధ్యమని అన్నారు. సీఎం అందించిన సంక్షేమ పథకాలతో పేదలు గడిచిన నాలుగేళ్లలో ఆర్థికంగా బలోపేతమై వారి జీవన విధానాన్ని మెరుగుపరుచుకున్నారన్నారు. తొలుత స్థానిక కౌన్సిలర్ పాలపర్తి వెంకట్రావు, గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఎస్‌ఎస్‌సీ కాలనీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.

రూ.25.45 లక్షలతో జగనన్న కాలనీల ఆర్చిల నిర్మాణానికి శంకుస్థాపన...

చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు లే అవుట్లలో జగనన్న కాలనీల ఎంట్రెన్స్‌లలో రూ.25.45 లక్షలతో ఆర్చిల నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. గంగవరం లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో రూ.7 లక్షలతో, అగ్రహారం జగనన్న కాలనీలో రూ.6.15 లక్షలతో, కేవీ పాలెం జగనన్న కాలనీలో రూ.6.15 లక్షలతో, ఆయిల్ మిల్ సమీపంలోని జగనన్న కాలనీలో రూ.6.15 లక్షలతో నాలుగు ఆర్చిల నిర్మాణాలు చేపట్టినట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహసీల్దార్ మధుసూదన్ రావు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాడు-నేడు పనుల పరిశీలన

అల్లూరు (కొత్తపట్నం): అల్లూరు గ్రామంలోని మెయిన్ స్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కో ఆప్షన్ మెంబర్ బాజీ, ఉపసర్పంచ్ తాటిపర్తి సుబ్బారెడ్డి, బూత్ కన్వీనర్లు హరిబాబు, చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. నాడు-నేడు పనులకు రూ.31 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

సేవా కార్యక్రమాలు మంచి పరిణామం



చిన్నారులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- వెంకట ప్రసాద్‌కు నివాళులర్పించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నాయకుడు కావటి వెంకట ప్రసాద్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. వెంకట ప్రసాద్ వర్ధంతి సందర్భంగా స్థానిక బొమ్మరిల్లు హోంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కావటి రవికుమార్ నేతృత్వంలో బుధవారం నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వెంకట ప్రసాద్ వైఎస్సార్ సీపీకి ఎనలేని సేవచేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జలీల్, నాయకులు గంటా రాము, బొమ్మినేని మురళి, ఒంగోలు మండల అధ్యక్షుడు రాయపాటి అంకయ్య, కార్పొరేటర్లు షేక్ ఇంతిజార్, నరసయ్య, బొట్ల సుబ్బారావు, వర్దు శేషయ్య, ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ రమాదేవి, సువర్ణ, బాకా బ్రదర్స్, కోట వీధి వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో కారుణ్య నియామకం



కారుణ్య నియామకపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.బాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు కె.సాయికుమార్‌రెడ్డిని కారుణ్య నియామకం కింద జిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ సంబంధిత పత్రాన్ని ఎస్పీ మలికాగర్గ్ బుధవారం అందించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవాలని ఎస్పీ సూచించారు. పోలీసుల కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో సులోచన, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలి



హజ్ యాత్రికుల బస్సులకు జెండా ఊపుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: పవిత్ర మక్కా మసీదు యాత్రను (హజ్) విజయవంతంగా పూర్తిచేసుకోవాలని హజ్ యాత్రకు బయలుదేరుతున్న ముస్లింలను ఉద్దేశించి వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి అన్నారు. స్థానిక మర్కస్ మసీదు వద్ద ముస్లింలతో కలిసి బుధవారం దువా చేశారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఒక్కసారైన మక్కా పర్యటనకు వెళ్లి రావాలని ప్రతి ముస్లిం కోరుకుంటారని, అటువంటి పవిత్ర యాత్రకు బయల్దేరుతున్న ప్రతిఒక్కరి ఆశీర్వాదాలు తమకు అవసరమని అన్నారు. అనంతరం జిల్లా నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతున్న 109 మంది ముస్లింలు విజయవాడలోని ఎంబార్కిమెంట్ పాయింట్‌కు చేరుకునేందుకు వీలుగా రెండు ప్రైవేటు బస్సులను ప్రణీత్‌రెడ్డి ఏర్పాటు చేయించి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ ఎస్ఎం బాషా, మతపెద్దలు హమీద్, వాజిద్, వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మినేని మురళి, కరిముల్లా, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వాస్ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలినేని



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: స్థానిక కర్నూలు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో అన్నిరకాల వైద్య సదుపాయాలతో నగరంలో హాస్పిటల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సొసైటీ ఆఫ్ ఏపీ నెట్‌వర్క్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ యర్రం నాగార్జునరెడ్డి, హాస్పిటల్ డాక్టర్లు కాండారెడ్డి, రాధిక, ఐఎంఏ నాయకులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ

ఒంగోలు: మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా బుధవారం స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన కేంద్రమంత్రి బ్రిజ్‌భూషణ్‌పై ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం, కోర్టు జోక్యం చేసుకున్న తర్వాత కేసు నమోదు చేయడాన్ని బట్టి ఈ దేశంలో చట్టం అమలు జరుగుతుందా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను పూజించే దేశమని చెబుతూ మహిళలను లైంగికంగా వేధించిన మంత్రిపై ఇంతవరకు చర్య తీసుకోకపోవడంపై నరేంద్రమోదీ, అమిత్‌షాలు దోషులకు అండదండలు అందిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘ జిల్లా అధ్యక్షురాలు ఎస్.భారతి, జిల్లా కార్యదర్శి వి.మంజుల, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వేణి, ఎల్.మహేశ్వరి, అమ్మాజి, శృతి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ చుండూరి రంగారావు, పౌర సమాజం నరసింహారావు, ఏఐకేఎంఎస్ నాయకులు కొంగర నరసింహం, జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వి.అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్: మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. గుండాయపాలెంలో కాంట్రాక్టర్ నిర్మిస్తున్న గృహాలను బుధవారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వాడుతున్న మెటీరియల్‌ను పరిశీలించారు. హౌసింగ్ ఏఈ పృథ్వీ, హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఉలిచిలో గ్రామ సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది హాజరు పట్టీలు, వలంటీర్ల హాజరును పరిశీలించారు. నూతన సచివాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాయితేజ, ఉలిచి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పరిరక్షణకై ఉద్యమిద్దాం

ఒంగోలు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు దూరం చేసే చర్యలకు పాల్పడుతోందని, అందువలన ఉపాధి హామీ పరిరక్షణకై ఉద్యమిద్దామని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం గడిచిన 17 ఏళ్ల కాలంలో పేదల జీవితాల్లో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ పనులు లేని సీజన్లలో ఉపాధి హామీ పనులు లభించడం ద్వారా కుటుంబ ఆదాయాలు పెరిగాయన్నారు. పేదల కొనుగోలు శక్తి పెరిగిందని, జీవన ప్రమాణాలు కొంత మెరుగయ్యాయని అన్నారు. పేద ప్రజానీకానికి బాగా ఉపయోగపడిన చట్టాల్లో ఇది కూడా ఒకటన్నారు. వంద రోజుల పని, వందరోజుల కూలితో ప్రారంభమై నేడు కనీస వేతనం రూ.272కు చేరిందన్నారు. అటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నాయకులు జాలా అంజయ్య, కేజీ మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, బడుగు వెంకటేశ్వర్లు, వై.వీరనారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు లాభాలు అందించాలి

మద్దిపాడు: రైతులు తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలు ఆర్జించే దిశగా వారిని ప్రోత్సహిస్తూ ముందుకు నడపాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ అన్నారు. బుధవారం వీఏఏలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతులు లోదుక్కులు వేసి విత్తనశుద్ధి చేసుకున్న తర్వాత విత్తనాలు వేసుకోవాలని తెలిపారు. రైతులు పురుగుమందులు ఎరువుల వినియోగం పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులు వేసుకోవాలని చెప్పారు. సేంద్రియ ఎరువుల వాడకం వలన రైతులకు మంచి దిగుబడితో పాటు పంటలకు మార్కెట్‌లో అధిక ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శేషయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రమేష్